క్లుప్తంగా

రామతీర్థం సన్నిధిలో అన్నవరం పురోహితులు



స్వామి సన్నిధిలో శ్రీరామ రక్ష స్తోత్ర పారాయణం చేస్తున్న అన్నవరం పురోహితులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానాన్ని అన్నవరం సత్యనారాయణ స్వామి దేవస్థాన వ్రత పురోహితులు గురువారం సందర్శించారు. ముందుగా రామ దేవస్థానం అర్చకులు వారికి స్వాగతం పలికి, ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం స్వామి సన్నిధిలో అన్నవరం పురోహితులు శ్రీరామ రక్ష స్తోత్ర పారాయాణం చేపట్టారు. కార్యక్రమంలో దేవస్థాన అర్చకులు సాయిరామాచార్యులు, నరసింహాచార్యులు, కిరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు నాణ్యమైన విద్య

• తహసీల్దార్ గోవింద



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ గోవింద

పూసపాటిరేగ: చిన్నారులకు నాణ్యమైన విద్య అందించాలని తహసీల్దార్ తాడ్డి గోవింద అన్నారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో పోషణ్ బీ పఢాయి బీపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్నారులకు సులభమైన రీతిలో అర్థమయ్యే విధంగా పాఠ్యాంశాలు బోధించాలన్నారు. ఆరు సంవత్సరాల్లోపు పిల్లలకు జ్ఞాపక శక్తి పెరగడానికి తర్ఫీదు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎం.రాధిక, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సత్యవతి, రాజేశ్వరితో పాటు పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జెండర్ రిసోర్స్ సెంటర్‌ను వినియోగించుకోవాలి



సెంటర్ వివరాలు అడుగుతున్న ఏపీఎం గీత

నెల్లిమర్ల: జెండర్ రిసోర్స్‌సెంటర్‌ను వినియోగించుకోవాలని వెలుగు ఏపీఎం గీత సూచించారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన జెండర్ రిసోర్స్‌సెంటర్‌ను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. లింగ వివక్ష సమస్యల పరిష్కారానికి సెంటర్ ఎంతగానో దోహదపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం ఎస్‌వీడీ సురేష్, సీసీలు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ హుండీల ఆదాయం లెక్కింపు



ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది, భక్తులు

విజయనగరం టౌన్: నగరంలోని కంటోన్మెంట్ గూడ్స్‌షెడ్ వద్దనున్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం హుండీల ఆదాయాన్ని గురువారం లెక్కించారు. ఆలయ కమిటీ చైర్మన్ రెయ్యి శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో స్వామి సేవకులు, ఆలయ సిబ్బంది హుండీల ఆదాయం లెక్కించగా.. రూ. 77,319 రూపాయలు వచ్చిందని ఈఓ పద్మావతి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు సోమశేఖర్ శర్మ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వ్యక్తి అరెస్ట్



పశువులు తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని నెల్లిమర్ల – రణస్థలం ప్రధాన రహదారిలో స్థానిక నెలివాడ సమీపంలో ఎస్సై గణేష్, తన సిబ్బందితో కలిసి గురువారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా బొలెరో వాహనంలో అక్రమంగా 15 పశువులను తరలిస్తున్న వ్యాన్‌ను పట్టుకొని ఓ వ్యక్తిని అరెస్ట్ చేశారు. పశువుల రవాణాకు సంబంధించి ఎటువంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో వ్యాన్‌ను సీజ్ చేసి, తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు. కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

• చెట్లతో మానవ మనుగడ
• పచ్చదనాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిది
• నేడు ప్రపంచ అటవీ దినోత్సవం



ఈ ఏడాది అటవీ థీమ్



విజయనగరం గంటస్తంభం: అడవులు లక్షలాది మంది కుటుంబాలకు జీవనోపాధిగా నిలుస్తున్నాయి.. ప్రపంచ ఆహార భద్రతకు మూలస్తంభాలుగా పేరుగాంచాయి.. అటువంటి అడవులతో మానవ మనుగడ పెనవేసుకుని ఉంది. పచ్చదనంతో పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. అడవి నుంచి ఎన్నో ప్రయోజనాలు పొందుతూ మనం ముందుకెళ్తున్నాం.. అటువంటి అడవుల ప్రాముఖ్యత తెలియజేసేందుకే ప్రతి సంవత్సరం మార్చి 21న ప్రపంచ అటవీ దినోత్సవం నిర్వహిస్తున్నాం.. చెట్ల పెంపకం, అడవుల నరికివేతను అడ్డుకోవడం వంటి కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తూ.. ప్రతి సంవత్సరం కొత్త థీమ్‌తో ముందుకు వెళ్లాలని 2012లో యునెస్కో తీర్మానించింది. కార్యక్రమంలో భాగంగా అన్ని రకాల అడవుల ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తారు. ఇంటర్నేషనల్ డే ఆఫ్ ఫారెస్ట్స్ 2025కు గాను 'అడవులు మరియు ఆహారం' ఇతివృత్తంతో అడవుల ప్రాముఖ్యత వివరించాలని సూచించింది.

వాతావరణంలో మార్పులకు కారణం

భూ ఉపరితలంలో దాదాపు మూడింట ఒక వంతు అడవులే ఉన్నాయి. అడవులంటే కేవలం పచ్చదనమే కాదు. పలు రకాల జాతులు, జంతువులకు ఆవాసాలు. ప్రజలకు జీవనోపాధిని కలిగించే కర్మాగారాలు. అంతేకాదు ఆరోగ్యకరమైన అడవులు కార్బన్ సింక్‌లుగా పనిచేస్తాయి. సంవత్సరానికి బిలియన్ల మెట్రిక్ టన్నుల కార్బన్‌డయాక్సైడ్‌ను ఇవి గ్రహిస్తాయి. ఇవే కాకుండా వాతావరణ మార్పులను కంట్రోల్ చేయడంలో కీలకపాత్ర పోషిస్తాయి. వీటిని నరికివేయడం వల్ల వాతావరణంలో తీవ్ర మార్పులు చోటు చేసుకుంటాయి. ఇవి ఆరోగ్యంపై దుష్ప్రభావాలను చూపిస్తాయి.

ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం..

అడవులు వాతావరణంపై తీవ్రమైన మార్పులు చూపిస్తాయి. వాతావరణ మార్పుల కారణంగా పర్యావరణ పరిస్థితుల్లో మార్పు వస్తుంది. దీంతో అనేక రకాల వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. ఉష్ణోగ్రతలు పెరిగి మనుషులపై తీవ్ర ప్రభావాలు చూపిస్తున్నాయి. వేడి పెరిగితే మంచు కరిగి.. తీవ్రమైన వరదలు వచ్చే ప్రమాదం ఉంటుంది. తీవ్రమైన చలి, తీవ్రమైన ఎండలు ఆరోగ్యాన్ని అతలాకుతలం చేస్తాయి. ఇప్పటికే ఈ మార్పులు చాలా ఇబ్బంది పెడుతున్నాయి. వర్షాలు పలు చోట్ల అతిగా కురుస్తుంటే.. మరో చోట అనా వష్టిగా కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో అడవులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది.

ఇన్నోవేషన్ పేరుతో నరికేస్తున్నాం..

ఔషధాల పేర్లతో, మూలికలు, దుస్తులు, నిర్మాణ వస్తువులు, మందులు, అనేక రోజూవారీ వస్తువుల కోసం అడవులను ఉపయోగించుకుంటున్నాం. అభివృద్ధి పేరుతో మరికొందరు చెట్లను నరికి అపార్ట్‌మెంట్లు, కర్మాగారాలు నిర్మిస్తున్నారు. మనం ఎన్ని చెట్లు నరికామో.. అంతకు రెట్టింపు మొక్కలు నాటాల్సిన బాధ్యత మనపై ఉంటుంది. వాతావరణంలో వస్తున్న మార్పులు చూసైనా అడవుల నరికివేత మానుకోవాలని పలువురు సూచిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణ నేపథ్యంలో అడవులను కాపాడుకోవాలని అటవీ శాఖాధికారులు పిలుపునిస్తున్నారు.

అడవుల ప్రాముఖ్యత

ఆహారం, ఔషధం : పండ్లు, గింజలు, విత్తనాలు, పుట్టగొడుగులు, తేనెను అందిస్తాయి. ప్రపంచవ్యాప్తంగా 5 బిలియన్లకు పైగా ప్రజల ఆహారం, ఔషధ అవసరాలను తీరుస్తున్నాయి.
• వంట ఇంధనం: ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల ప్రజల వంట అవసరాలు తీరుస్తున్నాయి.
• వ్యవసాయ మద్దతు: అడవులు నేలను సుసంపన్నం చేస్తాయి. నీటిని నిలుపుకుంటాయి. పంట ఉత్పత్తిని పెంచుతాయి.
• గ్రామీణ జీవనోపాధి : గ్రామీణ ప్రాంత వాసులకు కలప, ఆహారోత్పత్తుల రూపంలో జీవనోపాధి కలుగుతుంది.
• నీటి లభ్యత: అడవులు మంచినీటిని సరఫరా చేయడంతో పాటు నీటి నాణ్యతను పెంచుతాయి.

పచ్చని చెట్లతోనే మనుగడ



అడవులతోనే మానవ మనుగడ ఆధారపడి ఉంది. కానీ మానవుల స్వార్థం కారణంగా భూమిపై అడవులు నానాటికీ అంతరించిపోతున్నాయి. అయితే అడవులపై అవగాహన పెంచడానికి, మొక్కల పెంపకాన్ని ప్రోత్సహించేందుకు 2012లో యునైటెడ్ నేషనల్ జనరల్ అసెంబ్లీ.. ప్రపంచ అడవుల దినోత్సవాన్ని ప్రారంభించింది. చెట్ల పెంపకం వంటి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తాం. పాఠశాలలు, కళాశాలల్లో మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టాలి. అలాగే స్వచ్ఛంద సంస్థలు, పౌరులు తమ కాలనీలో మొక్కలు నాటాలి.

ఆర్.కొండలరావు, జిల్లా అటవీశాఖ అధికారి

బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి

• సీఐటీయూ జిల్లా కార్యవర్గ సభ్యుడు సూర్యనారాయణ



ఎంఈఓ పాపినాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

పూసపాటిరేగ: మధ్యాహ్నభోజన కార్మికుల వేతనాలు పెంచడానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని సీఐటీయూ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.సూర్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక విద్యాశాఖ కార్యాలయంలో మధ్యాహ్న భోజన కార్మికులతో కలిసి ఎంఈఓ బి.పాపినాయుడును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన కార్మికులకు నెలకు 26 వేల రూపాయల వేతనం ఇవ్వాలన్నారు. అలాగే పీఎఫ్, ఈఎస్ఐ వంటి సౌకర్యాలు కల్పించాలని సూచించారు. కార్మికులను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించి అపాయింట్‌మెంట్ ఆర్డర్, గుర్తింపుకార్డు, రెండు జతల యూనిఫారాలు అందజేయాలన్నారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం నాయకులు దిబ్బడి కంచమ్మ, డి.నాగమణి, లెంక సీతమ్మ, తట్టకోట రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు



ఆండ్ర జలాశయం నుంచి చంపావతికి చేరుకున్న నీరు

విజయనగరం: వేసవికాలంలో నీటి ఎద్దడి తలెత్తకుండా అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని, ఇందులో భాగంగా ఆండ్ర జలాశయం నుంచి విడుదలైన నీరు చంపావతిలోకి చేరుకుందని విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. ఆండ్ర ప్రాజెక్ట్ గేట్ నెంబర్ 2 నుంచి ఈ మేరకు పది రోజుల కిందట నీటిని విడుదల చేశారు. కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ సూచనలతో ఇరిగేషన్ అధికారులతో సంప్రదింపులు జరిపిన కమిషనర్ ప్రతి ఏడాది వలే ఈ ఏడాది కూడా నీటి విడుదలకు చొరవ చూపారు. ఆండ్ర జలాశయం నుంచి నేరుగా మర్రివలస, పిట్టాడ, మెంటాడ, గజపతినగరం, డోలపేట, జీవపేట మీదుగా మొత్తం 40 కిలోమీటర్లు ప్రవహించి నెల్లిమర్ల వద్దనున్న చంపావతి నదిలోకి చేరుతోంది. ఇక్కడి ఇన్‌ఫిల్ట్రేషన్ ఊటబావుల నుంచి నెల్లిమర్ల మాస్టర్ పంప్‌హౌస్ ద్వారా విజయనగరం కార్పొరేషన్‌కు నీటి పంపిణీ జరుగుతుందని కమిషనర్ పల్లి నల్లనయ్య ఈ సందర్భంగా తెలిపారు.

మాదకద్రవ్యాల నియంత్రణలో భాగస్వాములు కావాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై గణేష్

• ఎస్సై గణేష్

నెల్లిమర్ల రూరల్: మాదకద్రవ్యాల నియంత్రణలో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలని ఎస్సై గణేష్ పిలుపునిచ్చారు. మండలంలోని వల్లూరు గ్రామంలో సంకల్పం కార్యక్రమంలో భాగంగా గురువారం రాత్రి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ప్రస్తుత ఆధునిక యుగంలో యువత జల్సాలకు ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. ఈక్రమంలో మాదకద్రవ్యాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లల నడవడికను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నెల్లిమర్ల: నెల్లిమర్ల సబ్‌స్టేషన్ పరిధిలో జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టనున్న నేపథ్యంలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈఈ పి.త్రినాథరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లిమర్ల, జరజాపుపేట, రామతీర్థం, మొయిద జంక్షన్, థామస్‌పేట, లక్ష్మీదేవిపేట ప్రాంతాల్లో సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

మృదంగ విభాగ నిపుణుడిగా రవి



డాక్టర్ మండపాక రవి

విజయనగరం టౌన్: ఫ్రెండ్స్ ఫైనార్ట్స్ అసోసియేషన్ కార్యదర్శి, రోటరీ దశగి పేరిరాజు మ్యూజిక్ అకాడమీ ప్రిన్సిపాల్‌గా సేవలందిస్తున్న డాక్టర్ మండపాక రవిని పుట్టపర్తి సత్యసాయి ఉన్నత విద్యాలయం సంగీత విభాగం బోర్డ్ ఆఫ్ స్టడీస్ కమిటీ మెంబర్‌గా, తబలా విభాగా నిపుణుడిగా గుర్తించారు. ఈ మేరకు ఆన్‌లైన్‌లో ధృవపత్రం అందించినట్లు రవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు సంగీత విద్వాంసులు, విశ్లేషకులు, పట్టణ ప్రముఖులు, అకాడమీ సభ్యులు, అధ్యాపకులు, విద్యార్థులు, అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

రామభద్రపురం: మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా స్త్రీనిధి రుణాలు అందజేస్తున్నామని వెలుగు ఏసీ ఎస్.ఆదియ్య తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో ఏపీఎం కె.అన్నపూర్ణతో కలిసి వీవోఏలు, సీసీలతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. స్త్రీనిధి రుణాల వసూళ్లు వేగవంతం చేయాలని సూచించారు. గజపతినగరం క్లస్టర్ పరిధిలో 6,630 మంది మహిళలకు స్త్రీనిధి కింద రూ.38.75 కోట్లు రుణాలు ఇచ్చేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇప్పటివరకు 4,600 మందికి రూ.37.92 కోట్ల రుణాలు ఇచ్చామన్నారు. వ్యవసాయ రైతుల ఆర్థిక బలోపేతానికి పైలట్ ప్రాజెక్టు కింద రామభద్రపురం మండలంలో రామభద్రపురం, దత్తిరేజేరు మండలంలో పోరలి, సరాయివలస, గడసాం, టి.బూర్జవలసలను ఎంపిక చేసి ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్ క్లస్టర్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా రామభద్రపురంలో 290, దత్తిరేజేరు మండలంలో 180 మంది రైతు కుటుంబాల వివరాలు సేకరించామన్నారు.

విద్యుత్ ఒప్పందాన్ని రద్దు చేయాలి



విజయనగరం గంటస్తంభం: విద్యుత్ బిల్లులను దహనం చేసిన సీఐటీయూ సభ్యులు

విజయనగరం గంటస్తంభం: అదానీతో కుదిరిన సెకీ ఒప్పందం రద్దు చేయడంతో పాటు ట్రూఅప్ చార్జీలను ఉపసంహరించుకోవాలని సీఐటీయూ నగర అధ్యక్షుడు ఎ. జగన్‌మోహనరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక రాజీవ్ స్టేడియం వద్ద ప్రజలు, కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి, విద్యుత్ బిల్లులను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారంలోకి రాకముందు కూటమి పెద్దలు బాదుడే బాదుడు అనే పేరుతో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టారని, తీరా అధికారంలోకి వచ్చాక విద్యుత్ బిల్లులను ఎడాపెడా పెంచేస్తున్నారని ఆరోపించారు. కేవలం విద్యుత్ రంగంలోనే 17 వేల కోట్ల రూపాయల భారం ప్రజలపై వేయడం తగదన్నారు. మంత్రి నారా లోకేష్ యువగళం పాదయాత్రలో అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వ్యవసాయ మోటార్లకు పెట్టిన స్మార్ట్ మీటర్లను తగలబెట్టండి.. అధికారంలోకి రాగానే రద్దు చేస్తామని ప్రకటించారని తెలిపారు. కాని ఇప్పుడు ప్రభుత్వమే స్మార్ట్‌మీటర్లను ఏర్పాటు చేస్తోందని చెప్పారు. అదానీతో కుదిరిన సెకి ఒప్పందంలో వేల కోట్ల రూపాయలు చేతులు మారాయని అమెరికా కోర్టులో కేసు నమోదైనా.. కూటమి ప్రభుత్వం ఆ ఒప్పందాన్ని ఎందుకు రద్దు చేయడం లేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో రమా, నాగమ్మ, స్వప్న, కృష్ణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ..



ఉమ్మడి విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావును పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు గురువారం పరామర్శించారు. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ ఆయన రెండో కుమారుడు ప్రణీత్ బుధవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, అరకు శాసనసభ్యుడు రేగం మత్స్యలింగం, మాజీ ఎంపీ గొడ్డేటి మాధవి, చింతపల్లి ఎంపీపీ కోరాబా అనూషాదేవి, తదితరులు ప్రణీత్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. – విజయనగరం

విద్యుత్ ట్రూఅప్ చార్జీలు రద్దు చేయాలి..



విద్యుత్ ట్రూఅప్ చార్జీలను రద్దు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యురాలు పి. రమణమ్మ డిమాండ్ చేశారు. సీపీఎం రాష్ట్ర పిలుపులో భాగంగా గురువారం స్థానిక ఎల్‌బీజీ నగర్ పరిధిలోని 46వ వార్డులో విద్యుత్ బిల్లులు దహనం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..టీడీపీ ప్రభుత్వం ఎటువంటి చార్జీలు పెంచమని చెబుతూనే ట్రూఅప్ చార్జీల పేరుతో వేల కోట్ల రూపాయల భారం ప్రజలపై మోపడం తగదన్నారు. వెంటనే చార్జీలను రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో నగర కమిటీ సభ్యులు బి.రమణ, శాఖా కార్యదర్శి ఆర్. శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు. – విజయనగరం గంటస్తంభం

భూముల రీసర్వేకు సహకరించాలి

• తహసీల్దార్ సుదర్శనరావు



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న రెవెన్యూ సిబ్బంది

నెల్లిమర్ల రూరల్: భూ సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా గ్రామాల్లో చేపడుతున్న భూముల రీసర్వేకు రైతులు సహకరించాలని తహసీల్దార్ సుదర్శనరావు కోరారు. మండలంలోని సతివాడ గ్రామ సచివాలయంలో రైతులకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ చేపట్టి రీ సర్వే ఆవశ్యకతను వివరించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ.. భూముల రీసర్వేతో రైతులకు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. ఏళ్ల కాలం నుంచి ఉన్న సమస్యలు రీసర్వేతో పరిష్కారమవుతాయని, రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఎస్‌డీటీ సత్యనారాయణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.